మినుము రైతుపై తెగుళ్ల పోటు

- డివిజన్‌లో విస్తారంగా మినుముసాగు
- పూత దశలో ఆశించిన పురుగు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

డివిజన్ వ్యాప్తంగా రబీలో సాగైన మినుము వివరాలు	
మండలం	విస్తీర్ణం (హెక్టార్లలో..)
ఆత్మకూరు	7 వేలు
వెలుగోడు	2 వేలు
కొత్తపల్లి	7 వేలు
పాములపాడు	9 వేలు


ఆత్మకూరు: ఖరీఫ్ రైతన్నకు కలిసి రాలేదు. రబీపై ఆశలు పెట్టుకున్నా తెగుళ్ల నీళ్ల చల్లుతున్నాయి. ముఖ్యంగా మినుము రైతుకు తెగుళ్ల పోటు తప్పడం లేదు. ఈ యేడాది డివిజన్ పరిధిలో రబీ సీజన్‌లో మినుము పంటను రైతులు గతేడాది కంటే విస్తారంగా సాగుచేశారు. విత్తనం మొలకెత్తి ఏపుగా పెరుగుతుండటంతో పైర్లను చూసి రైతన్నలు మురిసిపోయారు. ప్రస్తుతానికి 50 రోజుల పైరు.. పూత వచ్చే దశలో ఊహించని విధంగా తెగుళ్ల అధికమయ్యాయి. సాధారణంగా మినుము పంట ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుంది. అయితే తెగుళ్ల వల్ల దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తెగుళ్ల..నివారణ చర్యలు

మినుము పంటకు దోమపోటు, పసుపుపచ్చ పురుగు, పల్లాకు తెగుళ్ల, పూత పురుగు, బూడిద తెగుళ్ల, ఆకుమచ్చ, లద్దె పురుగు, పచ్చ పురుగు, ఎండుతెగుళ్ల అత్యధికంగా వ్యాపిస్తున్నాయి. విత్తనం వేసిన 15 రోజుల నుంచి ఈ తెగుళ్ల రావడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. పంటకు ఆశించే తెగుళ్ల నివారణకు అత్యధికంగా పురుగు మందులను పిచికారీ చేస్తున్నా ఫలితం లేకపోవడంతో వ్యవసాయ అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల తుఫాన్ ప్రభావం వల్ల లద్దె పురుగు అత్యధికంగా వ్యాపించడంతో పూత సైతం రాలిపోవడంతో మినుము రైతుల్లో ఆందోళన నెలకొంది. పైర్లు ఏపుగా పెరగకపోవడం, తెగుళ్ల నివారణకు ఇప్పటికే ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల దాకా పెట్టుబడులు పెట్టారు. ప్రతి క్రిమిసంహారక మందుల దుకాణాల్లో రైతులు ఎకరాకు రూ.50 వేలకు పైగా అప్పు చేశారు. పెట్టుబడులైనా చేతికి వస్తాయో లేదోనని భయంతో రైతులు దిగులు చెందుతున్నారు.


మినుము పంట


మినుము పంటలో లద్దె పురుగు


మినుము పంటకు ఏర్పడిన తెగుళ్లు

పంటలు కాపాడుకోండి



తుఫాన్ ప్రభావంతో ఎక్కువ తెగుళ్ల సోకుతున్నాయి. పల్లాకు తెగుళ్ల అధికంగా ఉంది. విత్తనశుద్ధి చేయని పొలాల్లో ఎకరాకు 5 నుంచి 10 వరకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. జిగురు అట్టలను 8-10 ఉపయోగించాలి. పురుగు నివారణకు 10 కిలోల పాలీస్‌తవుడు, 2 కిలోల బెల్లం, 400 ఎం.ఎల్. మోనోక్రోటోపాస్ కలిపి సాయంత్రం లేదా, ఉదయం పిచికారీ చేయాలి. పూతల పురుగు మినుము పంటకు అధికంగా ఉంటుంది, ఈ పురుగు ఆకులు, కాయల నడుమ గూడు కట్టుకుని ఉంటుంది. ఎక్కువగా నష్టాన్ని కలిగిస్తుంది. ఈ పురుగు నివారనకు నొవాల్యూరన్ ఎకరాకు 400 మి.మీ. చొప్పున వేపనూనె 500 ఎం.ఎల్. తయోడికార్బ్ మందులను పిచికారీ చేయాలి. బూడిద తెగులు ఎక్కువగా తుఫాన్ పరిస్థితుల వల్ల ఏర్పడుతుంది. మబ్బులు ఉండడం వల్ల ఈ వ్యాధి సోకుతుంది. నివారణకు సల్ఫర్ 600, రెండో దశలో మైక్రోబుటానియల్ పిచికారీ చేయాలి. పచ్చ పురుగు నివారణ కోసం బుటానియల్, బెంజోయేట్ లేదా స్పోరాజిన్‌లను ఉపయోగించాలి. – విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఓ, ఆత్మకూరు

తెగుళ్లు అధికమయ్యాయి



నాలుగు ఎకరాల్లో మినుము పంట సాగుచేశాను. పూత దశలో ఉండగా పది రోజుల నుంచి పురుగు, తెగుళ్ల సోకాయి. మందులు పిచికారీ చేస్తున్నా తెగుళ్ల తగ్గడం లేదు. బూడిద తెగులు, పల్లాకు తెగులు, లద్దె పురుగు అధికంగా ఉంది. పెట్టుబడి అయినా చేతికి వస్తుందా రాదా అనే దిగులుతో ఉన్నా. – వెంకటేశ్వర్లు, రైతు, ఆత్మకూరు

క్లుప్తంగా

సాక్షి గణపతికి విశేష పూజలు


సాక్షిగణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధ జలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

ముగిసిన శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి

బండిఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సర్పంచ్‌లకు నిర్వహించిన లోకల్ సైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమాదేవి మాట్లాడుతూ సరైన ప్రణాళికలతో ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవచ్చన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ


శిక్షణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ రాము

ఆత్మకూరు: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జరిగిన కానిస్టేబుళ్ల సెలక్షన్‌లో ప్రాథమిక పరీక్షల్లో ఉత్తీర్ణులై, దేహదారుఢ్య పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సీఐ రాము తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 1,600 మీటర్లు, 100 మీటర్ల రన్నింగ్‌తో పాటు లాంగ్‌జంప్‌కు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఎంపికైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలి

నందికొట్కూరు: పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు అన్ని రకాల ప్రమోషన్లు ప్రభుత్వం వెంటనే కల్పించాలని డీటీఎఫ్ రాష్ట్ర నాయకులు రత్నం ఏసేపు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు కామన్ సర్వీస్ నిబంధనలను రూపొందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని చెప్పారు. ఉపాధ్యాయులు ప్రమోషన్లకు నోచుకోకుండా ఒకే క్యాడర్‌లో ఏళ్ల తరబడి మగ్గిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, డైట్ కళాశాలలో ఉన్న ఖాళీలను భర్తీ చేయడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకొని ఉమ్మడి సర్వీసు నిబంధనలు రూపొందించి పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు అన్ని రకాల ప్రమోషన్‌లను కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ముజహిద్ పాషా, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, లక్ష్మిప్రసన్న కుమారి, ఆఫ్రిన్‌భాను తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ వాయిదా వేయాలి


డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): శిక్షణ కార్యక్రమాలను వాయిదా వేసి వేసవిలో నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివయ్య, రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ జనార్దన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఒకే నెలలో నాలుగు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం మంచిది కాదన్నారు. ఒకే నెలలో ఫౌండేషనల్, లిటరసీ అండ్ న్యూమరసీ, లీడర్‌షిప్, గౌడ్స్ అండ్ స్కౌట్స్, జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేశారన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండటం వల్ల ఒక్కో శిక్షణ కార్యక్రమానికి ముగ్గురు లేదా నలుగురు ఉపాధ్యాయులను పంపడంతో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయలేకపోతున్నామన్నారు. ఎస్‌ఏ-1 పరీక్షలు, పేపర్ వాల్యూయేషన్, సిలబస్ పూర్తి చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పరీక్షల కాలం పొంచిఉండటంతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయకుండా శిక్షణ వాయిదా వేయాలని కోరారు. రాజ్‌కుమార్, దస్తగిరిబాషా, పుల్లయ్య, రాజేష్, మహమ్మద్ హనీఫ్, దీపక్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలి


మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రాంబాబు


మాట్లాడుతున్న మల్లికార్జున

మిడుతూరు: శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని గ్రామాభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని ఆత్మకూరు డీఎల్పీఓ రాంబాబు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా, మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు చేసుకోవాలన్నారు. ఇంటిపన్ను, కులాయిపన్ను వసుల్లలో జాప్యం చేయరాదన్నారు. సమావేశంలో ఎంపీడీఓ దశరథరామయ్య, ఈఓఆర్డీ సంజన్న, ఏఓ సురేష్‌కుమార్, పీఆర్ ఏఈ ప్రతాప్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, శిక్షణ రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఎంపీడీఓ చంద్రశేఖర్ అధ్యక్షతన రెండురోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజా ప్రతినిధులు,అన్ని శాఖల క్షేత్రస్థాయి అధికారులు ప్రజలతో సమన్వయమై పల్లెల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. ఆలోచింపజేయాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్వైజర్ లలితప్రభావతి బాలికా సంరక్షణ, బాల్య వివాహాలు, పౌష్టికాహారం తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై విచారణ చేపడతాం


రైతుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ రత్నరాధిక

ఆత్మకూరు: రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన భూ సమస్యలపై విచారణ చేపట్టి త్వరితగతిన పరిష్కారం చూపుతామని తహసీల్దార్ రత్నరాధిక తెలిపారు. బుధవారం మండలంలోని కరివేన గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామస్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరు దరఖాస్తులు అందాయని, వాటిపై విచారణ చేపట్టి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, కరివేన సర్పంచ్, ప్రజాప్రతినిధులు, వీఆర్వోలు, సర్వేయర్‌లు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మలా రైతుభరోసా కేంద్రం


కృష్ణాపురంలో ప్రారంభానికి నోచుకోని ఆర్‌బీకే

ఆత్మకూరురూరల్: మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలోని రైతుభరోసా కేంద్రం దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.లక్షలు వెచ్చించి రైతన్నల కోసం రైతు భరోసా కేంద్రం నిర్మాణం ప్రారంభించారు. 95 శాతం పనులు పూర్తయ్యాయి. అంతలోపే ప్రభుత్వం మారింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మిగిలిన 5 శాతం పనులు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉండగా పెడచెవిన పెట్టింది. కాగా ప్రభుత్వం మారడంతో బిల్లు జూరు సమస్యతో పనులు పూర్తి కాలేదని కాంట్రాక్టర్ చెబుతుండగా.. పనులు పూర్తి చేస్తేనే బిల్లులు మంజూరవుతాయని అధికారులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రైతు భరోసా కేంద్రాన్ని పూర్తి చేసి అన్నదాతలకు ఉపయోగపడేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఐసీడీఎస్ ఏపీడీగా నిర్మల

కర్నూలు న్యూసిటీ: జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఏపీడీగా నిర్మల నియమితులయ్యారు. నంద్యాల సీడీపీఓగా ఉన్న ఆమెకు పదోన్నతి కల్పించి జిల్లా ఏపీడీగా బదిలీ చేశారు. గతంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐసీడీఎస్‌కు ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టు ఉండేది. అయితే జిల్లాల విభజన తర్వాత ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టు నంద్యాల జిల్లాకు కేటాయించారు. జిల్లాకు అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టును కేటాయించారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఏపీడీగా బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ ఉన్నారు. ఒకటి రెండు రోజుల్లో కొత్త ఏపీడీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

జూపాడుబంగ్లా **బనగానపల్లె :** మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని రామక్రిష్ణాపురం గ్రామంలో అదనపు కట్నం కోసం వేధింపుల కేసు నమోదైనట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన కె ఉప్పరి లక్ష్మణస్వామి కుమార్తె మౌనికను 18 నెలల క్రితం ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం మిట్టమిదపల్లి గ్రామానికి చెందిన గిద్దలూరు నారాయణతో వివాహం జరిపించారు. వివాహ సమయంలో కట్నంగా రూ.3లక్షలతో పాటు ఆరు తులాల బంగారు ఇచ్చారు. అయినా అదనపు కట్నంగా మరో రూ.2లక్షలు తీసుకురావాలని భర్త నారాయణ, అత్త చంద్రావతి మానసికంగా, శారీరకంగా హింసించేవారు. బాధను భరించలేక మౌనిక పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు భర్త నారాయణ, మామ నడిపి రామయ్య, అత్త చంద్రావతిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పురస్కారం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఆర్టీసీ డిపోలో నవంబర్ మాసంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని బుధవారం డిపో ఆవరణలో అభినందించారు. డిపో మేనేజర్ గంగాధర్‌రావు, మద్దిలేటినాయుడు మాట్లాడుతూ అత్యధిక ఆదాయం తెచ్చిన కండెక్టర్లు తిరుపాలు, మల్లికార్జున, శేషన్న,రాజు డ్రైవర్ రాముడు, బాషా, ఖాన్, టీసీఆర్ స్వాములను అభినందిస్తూ ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహకం అందజేశారు. సూపరింటెండెంట్ కృష్ణమోహన్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలు వలస బాట...


పనులు లేకపోవడంతో వలస వెలుతున్న ఉపాధికూలీలు

కొత్తపల్లి: మండలంలో వ్యవసాయ కూలీలు వలస బాటపట్టారు. నాలుగు వారాలుగా ఏ గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించకపోవడంతో పేదలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. రేపేమాపో మరికొందరు వలస వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. మండలంలో 12 గ్రామపంచాయతీలు, 19 మాజారా గ్రామాలు ఉన్నాయి. అందులో 9 గిరిజన గూడేలు కూడా ఉన్నాయి. మండలంలో మొత్తం 35వేల జనాభా ఉండగా సుమారు 7,300 కుటుంబాలకు జాబుకార్డులు ఉన్నాయి. పనులు కల్పించాల్సి అధికారులు మాత్రం సిబ్బందితో సమీక్షా సమావేశాలకు మాత్రమే పరిమితమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధి పనులు లేనందునే సొంత గ్రామాలు వదిలి వెళ్తున్నామని వ్యవసాయ కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఉపాధి పనులు కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న దాసు

కొత్తపల్లి: ఉపాధి కూలీలకు కచ్చితంగా పనులు కల్పించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని సీఎల్ఆర్సీ కోర్స్ డైరెక్టర్ దాసు హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబుకార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పకుండా పనులు కల్పించాలన్నారు. రైతులను హార్టికల్చర్ సాగువైపు మళ్లించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఉద్యానవన పంటలను కూడా రైతులు సాగుచేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓలు హరికృష్ణ, రాజునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే ఏడాది ఐచ్ఛిక సెలవులు విడుదల

ఆత్మకూరు: వచ్చే యేడాది ఐచ్ఛిక సెలవులను కార్మికశాఖ సంయుక్త కమిషనర్ విడుదల చేసినట్లు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సారా మార్గరెట్ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ జనవరి 15న కనుమ, 26న రిపబ్లిక్ డే, మార్చి 31న రంజాన్, మే 1న కార్మిక దినోత్సవం, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం, ఆగస్టు 27న వినాయక చవితి, అక్టోబర్ 2న గాంధీజయంతి, డిసెంబర్ 25న క్రిస్మస్ పర్వదినాలు ఉంటాయని ఆయా తేదీలలో పరిశ్రమలు, దుకాణాలు తమ వద్ద పనిచేసే కార్మికులకు సెలవులు ఇవ్వాలన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నాపత్రాలు

మహానంది: ఇటీవల పది ప్రశ్నాపత్రాలు లీక్ అయిన విషయం సంచలనం కావడంతో విద్యాశాఖ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. అందులో భాగంగా ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ఎస్‌ఏ-1 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను పోలీస్‌స్టేషన్లకు చేర్చారు. దీంతో ఆయా జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బుధవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసుల నుంచి ప్రశ్నాపత్రాలను తీసుకుని వెళ్లారు. మహానంది మండలంలో ఐదు జిల్లా పరిషత్ పాఠశాలల్లోని విద్యార్థులకు 19వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి.

నివాళి

నందికొట్కూరు: పట్టణంలోని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యాలయంలో బుధవారం వినోద్ మిశ్రా వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమసమాజ స్థాపనకు వినోద్ మిశ్రా చేసిన పోరాటాలను ఈ సందర్భంగా ఏఐకేఎం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు షేక్షావలి, సామాన్యుడు, భాస్కర్‌గౌడ్, గౌండ సలాం, గఫూర్, మహిళలు బీబీ, లక్ష్మీదేవి, వీణబాయ్, చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు జీతాల్లేవ్!


పారిశుద్ధ్య కార్మికులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలం సున్నిపెంట గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఏడు నెలలుగా జీతాలు లేక అవస్థలు పడుతున్నారు. సున్నిపెంట గ్రామపంచాయతీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్‌లు లేకపోవడంతో ఏటా జిల్లా కలెక్టర్ విడుదల చేసే స్పెషల్ గ్రాంట్‌తో జీతాలు చెల్లిస్తున్నారు. నెలకు రూ.8,000 జీతం చొప్పున 21 మంది కార్మికులు గ్రామసచివాలయాలు ఏర్పడిన నాటి నుంచి పనిచేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సున్నిపెంట గ్రామపంచాయతీకి జరగకపోవడంతో కేంద్రం నుంచి 14, 15వ ఆర్థిక సంఘం నిధులు అందడంలేదు. దీంతో ప్రతినెలా కార్మికులకు జిల్లా కలెక్టర్ స్పెషల్‌గ్రాంట్ నిధులు ఇస్తేనే కార్మికులకు జీతాలు అందుతున్నాయి. ఈ యేడాది ఏడు నెలలు గడుస్తున్నా జీతాలు రాకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్రిస్మస్ నాటికైనా జీతాలు పడకపోతాయా అనే ఆశతో పారిశుద్ధ్య కార్మికులు ఎదురు చూస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలి


ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని ముసలమడుగు గ్రామం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ శీలం దేవదాస్ అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఏపీ గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ కరుణాసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీలం దేవదాసు పదేళ్లుగా ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారని, రాజకీయ ఒత్తిళ్ల మేరకు అధికారులు సస్పెండ్ చేయడం సమంజసం కాదన్నారు. సస్పెన్షన్ ఎత్తివేయకుంటే ఆందోళనలు ఉధ్రుతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎన్ సంపత్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ స్వాములు, ఫీల్డ్ అసిస్టెంట్లు సుధాకర్, నాయుడు, బ్రహ్మయ్య ఆచారి, అరుణ్, స్వాములు, ఎల్లా నాయుడు, రత్నాకర్, సురేష్, లచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి


ఉప కారాగారంలో ఖైదీల భోజనాలను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శేషాద్రి

ఆళ్లగడ్డ: ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి అన్నారు. బుధవారం స్థానిక ఉప కారాగారాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఉన్న ఖైదీలతో ఏ ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఎప్పటినుంచి రిమాండ్‌లో ఉంటున్నారు అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. మీకు న్యాయవాదులు ఉన్నారా అని ఆరా తీశారు. అలాగే జైలులో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జైలుకు వచ్చిన వారు తమ ప్రవర్తన మార్చుకోవాలన్నారు. అలాగే ఆర్థిక స్తోమత లేని వారు దరఖాస్తు చేసుకుంటే ఉచిత న్యాయ సహాయం అందజేస్తామన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

నందికొట్కూరు: జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణ సమీపంలోని జగనన్న కాలనీని సీపీఎం నాయకులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో నెలకొన్న రోడ్లు, మంచినీరు, విద్యుత్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. 15 రోజుల క్రితం విద్యుత్ మోటార్లు మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోవడం సమంజసం కాదన్నారు. కనీసం వీధి లైట్లు వెలగడం లేదని, చీకటిలో ప్రజలు మగ్గుతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్‌బాషా, బాబు, నాగన్న, రషీద్, షబ్బీర్, గోకారి, కాలనీ ప్రజలు అఖిలంబాషా, షబ్బీర్, గోకారి, మాబుషా, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

దేవనూరులో రెవెన్యూ సదస్సు

మిడుతూరు: మండల పరిధిలోని దేవనూరులో బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలపై ఏడుగురు రైతులు వినతులు అందజేశారని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ జహంగీర్, వీఆర్వో ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోండి

పాములపాడు: రబీలో సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోవాలని ఏఓ ఫణీశ్వరరెడ్డి రైతులకు సూచించారు. స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల మూలంగా పంట నష్టం జరినా, పంటను విక్రయించుకోవాలన్నా పంట నమోదు తప్పని సరి అని చెప్పారు. పంట నమోదుకు రైతులు అప్లికేషన్‌తోపాటు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పుస్తకం జిరాక్స్‌లు, మొబైల్ నంబరుతో ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని వివరించారు.